శిథిలావస్థలో ఆర్టీసీ బస్టాండ్

- పెచ్చులూడుతున్న పైకప్పు
- వర్షాలకు ఆవరణమంతా కారుతున్న వైనం



రాయదుర్గంలోని ఆర్టీసీ బస్టాండ్



పెచ్చులూడుతున్న బస్టాండ్ పైకప్పు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అనంతపురం రహదారిలో ఉన్న ఏపీఎస్ఆర్టీసీ డిపో బస్టాండ్ శిథిలావస్థకు చేరుకుంది. 1989లో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌లో ఇప్పటి వరకూ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు జరగడం లేదు. కేవలం అడ్మినిస్ట్రేటివ్ కార్యకలాపాలు తప్ప.. డిపో బస్టాండ్ నుంచి బస్సు రాకపోకలు లేవు. దీంతో నిరుపయోగంగా మారింది. ప్రయాణికుల కోసం బస్సు రాకపోకలన్నీ పట్టణ నడిబొడ్డున ఉన్న దేవదాయశాఖకు చెందిన పాత బస్టాండ్ (రాణీఛత్రం) నుంచి కొనసాగుతున్నాయి. డిపో నిర్మించి దాదాపు 36 ఏళ్లు కావస్తుండడంతో ప్రస్తుతం పైకప్పు శిథిలావస్థకు చేరుకుని పెచ్చులూడుతున్నాయి. అంతే కాక వర్షాల కారణంగా డిపో ఆవరణమంతా కారుతోంది. మరోవైపు బస్టాండ్ ఆవరణమంతా కంకరతేలి గుంతలమయమైంది. పట్టణానికి ప్రైవేటు బస్టాండ్ కేంద్రంగా ఉండి వ్యాపారులు, ప్రజలకు అనుకూలంగా ఉండడంతోనే ఏళ్ల తరబడి ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు నడపలేదు. కానీ ప్రస్తుతం పట్టణ విస్తీర్ణం పెరగడం, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో వ్యాపారాలు బాగా అభివృద్ధి చెందాయి. ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు రాకపోకలు ప్రారంభించినా అక్కడ సరైన వసతులు లేవు. పైగా దాదాపు 36 ఏళ్లు కావడంతో శిథిలావస్థకు చేరుకోవడంతో అనుకూలంగా లేదు. ఇటీవల డిపో తనిఖీకి విచ్చేసిన మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు దృష్టికి డిపో ఆధునీకరణపై రాయలసీమ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, పట్టణ వాసులు వినతిపత్రం సమర్పించారు. ఐదేళ్ల ఆదాయాన్ని దృష్టిలో నూతన డిపో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. డిపో నుంచి ఆర్టీసీ బస్సు రాకపోకలు కొనసాగిస్తే పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గే అవకాశం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



బస్టాండ్ ఆవరణలో వర్షపు నీరు కారుతున్న దృశ్యం

‘కూటమి’ మోసాలను ప్రజలకు తెలియజేయండి

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం మోసాలను ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోళ్ల సూరి ఆ పార్టీ నేతలకు సూచించారు. శుక్రవారం దురదగుంట, కోడిపల్లి పంచాయతీల్లో ‘బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ’ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాల్లో భారీగా కోతలు విధించిదన్నారు. ఎంతో మంది అర్హులకు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అందలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా జిల్లా కోఆర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, లీగల్ సెల్ అధ్యక్షులు రామాంజనేయులు, ఎంపీటీసీ రవి, పంచాయతీ రాజ్ విభాగం మండలాధ్యక్షుడు చెన్నకేశవులు గౌడ్, జేసీఎస్ మండల కన్వీనర్ ఆంజి, రైతు విభాగం అధ్యక్షుడు చిత్తయ్య, నాయకులు పాతలింగ, దొడగట్ట మురళి, బోరంపల్లి రామిరెడ్డి, హులికల్లు మోహన్, మల్లి, బ్రహ్మయ్య, వన్నూరస్వామి, చౌడప్ప, నాగేంద్ర, లక్ష్మనారాయణ, రమణ, మహేష్, రామూర్తి, లక్ష్మన్న, బడప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



దురదకుంట గ్రామంలో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

రాయదుర్గంటౌన్: వినాయక మంటపాల ఏర్పాటు కోసం ముందస్తుగా ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకోవాలని రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక మంటపాల నిర్వాహకులతో శాంతి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ 27 నుంచి జరిగే గణేష్ ఉత్సవాలను అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వినాయక ఉత్సవ అనుమతుల కోసం పోలీసు శాఖ ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. మంటపాల నిర్వాహకులు పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు.

కణేకల్లు: వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ నాగమధు సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. వినాయక ఉత్సవాల అనుమతుల కోసం పోలీసుశాఖ fanerhutrav.net అనే వెబ్ సైట్ ఏర్పాటు చేసిందని, మండపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.



రాయదుర్గంలో మాట్లాడుతున్న సీఐ జయనాయక్

బొమ్మనహాళ్: బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్‌ఐ నబీరసూల్ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండపాలను పోలీసులు తనిఖీ చేసి నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరంభ్యంతర పత్రాన్ని ఇస్తామన్నారు.

బెళుగుప్ప: మండలంలోని గ్రామాల్లో ఈనెల 27 నుంచి నిర్వహించే వినాయక చవితి వేడుకలకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని ఎస్‌ఐ శివ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు పొందాలన్నారు. కచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు.

ఆదర్శ పాఠశాలకు రోడ్డు వేయండి

వజ్రకరూరు: మండల కేంద్రమైన వజ్రకరూరు పరిసర ప్రాంతంలో ఉన్న ఆదర్శ (మోడల్)పాఠశాలకు రోడ్డు వేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. సుమారు 600 మంది దాకా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలకు వెళ్లే దారి మట్టి రోడ్డు కావడంతో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి పాఠశాలకు నూతన రోడ్డును ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధ్వానంగా గంజికుంటరోడ్డు



గుంతలు పడిన గంజికుంట రోడ్డు

వజ్రకరూరు: మండల కేంద్రమైన వజ్రకరూరు నుంచి గంజికుంటకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డు దెబ్బతినడంతో రాళ్లు తేలాయి.దీంతో వాహన దారులు, ప్ర జలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఈ రహదారి వెంట నిత్యం వందలాది మంది పనుల నిమిత్తం వజ్రకరూరుకు వస్తుంటారు. రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి నూతన రోడ్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కెనరా బ్యాంక్ ఆకస్మిక తనిఖీ

కుందుర్పి: స్థానిక కెనరా బ్యాంక్‌ను శుక్రవారం సాయంత్రం బ్యాంక్ ఏజీఎం ప్రదీప్‌కుమార్, ఆర్ఎం శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అనంతరం మండలంలోని రైతులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలతో వారు మాట్లాడారు. కుందుర్పిలో ఒకే ఒక బ్యాంక్ ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పలువురు ఏజీఎంకు ఫిర్యాదు చేశారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండల పరిధిలోని తగ్గుపర్తిలో శుక్రవారం రాష్ట్ర ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ మాస్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మౌనిక గ్రామపెద్దలు, సచివాలయ ఉద్యోగులు స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కలసి ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఐవీ, సుఖవ్యాధులు, క్షయ, డ్రగ్స్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠ, పంచాయతీ సెక్రటరీ శంకర్, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిల్, హెచ్‌ఎం ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

వజ్రకరూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మాల మహానాడు ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డు గ్రహీత ఫీల్డ్ అసిస్టెంట్ రజాక్‌వలిని సత్కరించారు. ఇటీవల స్వాతంత్ర్య దిన వేడుకల్లో పీసీ ప్యాపిలికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం వజ్రకరూరు ఎంపీడీఓ కార్యాలయంలో రజాక్‌ను సన్మానించారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలక బాలరామాంజినేయులు, ఎంపీడీఓ దామోదర్‌రెడ్డి, ఏపీఓ విమల, టీఏఓ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురికి తీవ్రగాయాలు

బెళుగుప్ప: మండలంలోని గుండ్లపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాల ఢీ కొన్నాయి. ఘటనలో గుండ్లపల్లికి చెందిన రాము, కళ్యాణదుర్గానికి చెందిన సునీల్, భాను తీవ్రంగా గాయపడ్డారు. అచేతనంగా పడివున్న రామును ఎస్‌ఐ శివ తనే స్వయంగా జీపులో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఆ తర్వాత ముగ్గురిని మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

కమ్మూరు వద్ద బొలెరో-కారు ఢీ

కూడేరు: మండలంలోని కమ్మూరు వద్ద అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి బొలెరో-కారు ఢీ కొన్నాయి. ఘటనలో అనంతపురానికి చెందిన రత్నకుమార్, లిఖిత్ వర్మ, కడదరకుంటకు చెందిన శ్యామ్ తీవ్రంగా గాయపడ్డారు. రత్నకుమార్, లిఖిత్ వర్మ కారులో అనంతపురం వెళ్తున్నారు. శ్యామ్ బొలెరోలో స్వగ్రామానికి వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను పోలీసులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

హథీరామ్ మఠం ఆస్తులను పరిరక్షించాలి

వజ్రకరూరు: బంజారాల ఆరాధ్యదైవం హథీరామ్ బావాజీ మఠం ఆస్తులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిరక్షించాలని బంజారా సంఘం నాయకుడు సుబ్రహ్మణ్యంనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హథీరామ్ బావాజీ మఠం ఆస్తుల పరిరక్షణకు ఈనెల 23న తిరుపతిలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామన్నారు. సమావేశానికి మేధావులు, బంజారా నాయకులు, అభ్యుదయవాదులు తరలిరావాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పురాతన కట్టడాలను పరిరక్షిస్తున్నారని, అయితే దేశవ్యాప్తంగా 15 కోట్ల బంజారాలు ఆరాధ్యదైవంగా భావించే హథీరాం మఠాన్ని కుల్చాలని ప్రయత్నిస్తుడటం బాధాకరమన్నారు.

వర్షానికి పంట నష్టం



కుళ్లిన కంది పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండల పరిధిలోని కొనకొండ్లలో శుక్రవారం గ్రామానికి చెందిన కౌలు రైతు పెద్దరాజు నాలుగు ఎకరాల్లో సాగు చేసిన కంది పంట తొలగించాడు. ఇటీవల కురిసన భారీ వర్షానికి కంది పంట మొత్తం కుళ్లిపోయింది. చేసేదిలేక కంది పంటను తొలగించినట్లు పెద్దరాజు ఆవేదన వ్యక్తం చేశారు. రూ.50 వేల నష్టం వచ్చిందని, ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించారు.

ఆలయాల్లో శ్రావణ శోభ



రాయదుర్గంలోని నేసేపేటలో వర మహాలక్ష్మీదేవి



రాయదుర్గంలోని హటకేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ పూజ నిర్వహిస్తున్న మహిళలు



కుందుర్పిలో అమ్మవారు



కుందుర్పిలో హోమం నిర్వహిస్తున్న ధర్మకర్త

రాయదుర్గంటౌన్: దేవాలయాల్లో చివరి శ్రావణ శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. పట్టణంలోని హటకేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో వరమహాలక్ష్మీ వ్రత పూజ చేశారు. అనేక మంది మహిళలు, మండలి సభ్యులు హాజరయ్యారు. శారదాదేవి ట్రస్ట్ నిర్వాహకులు స్వామి అర్చనానంద, వారి శిష్యబృందం అమ్మవారి కీర్తనలు, భజనలు ఆలపించారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం చేపట్టారు. నేసేపేటలోని వర మహాలక్ష్మీ ఆలయం, కళ్లీమఠం హైస్కూల్ వద్ద వెలసిన మహాలక్ష్మీ ఆలయం, మల్లాపురం ఇందిరమ్మ లేఅవుట్‌లోని గజలక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వాసవీమాత ఆలయంలో, శాంతినగర్‌లోని బన్నిమహంకాళి ఆలయంలో, దుగ్గిలమ్మ ఆలయాల్లో, బసవనాగలింగేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

కుందుర్పి: మండల కేంద్రంలో వెలసిన కుందుర్పమ్మ దేవత ఆలయంలో చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్త సత్యనారాయణశాస్త్రి ఆధ్వర్యంలో లోక కళ్యాణం కోసం హోమం నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ రామ్మూర్తి పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి హోమంలో భాగస్వాములయ్యారు.

సేంద్రియ వ్యవసాయమే శ్రేయస్కరం

కుందుర్పి: సేంద్రియ వ్యవసాయం రైతులకు శ్రేయస్కరమని ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి, ఐఐఎస్‌సీ శాస్త్రవేత్త రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నిజవల్లి, మలయనూరు, కుందుర్పిలో వారు రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పురుగు మందులు వాడడం వల్ల పంటల ద్వారా ఎలాంటి ప్రయోజనం ఉండదని, సహజ సిద్ధంగా దొరికే ఎరువులను వాడితే ఆశించిన ఫలితాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పద్మలత, సుష్మా, ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బొమ్మనహాళ్: కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గం జిల్లా మెలకల్మూరు తాలుక, రాంపురం గ్రామానికి చెందిన లమ్మాని సంతోష్ కుటుంబ సభ్యులతో కలసి గత జూలై 22న కొలిమి పని చేసుకునేందుకు బొమ్మనహాళ్‌కు వచ్చాడు. అదే నెల 23న తెల్లవారుజామున 5 గంటల సమయంలో కూతురు బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి, తిరిగి రాలేదని బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆచూకీ తెలిస్తే 9346010584 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్‌ఐ కోరారు.

క్లుప్తంగా

యువ రైతుకు సన్మానం



సంజీవరెడ్డిని సత్కరిస్తున్న వ్యవసాయశాఖ ఏడీ, జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

ఉరవకొండ: మండల పరిధిలోని రాయంపల్లి యువ రైతు సంజీవరెడ్డిని శుక్రవారం ఉరవకొండ జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉరవకొండ వ్యవసాయశాఖ ఏడీఏ సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. సంజీవరెడ్డి ఎర్ర మిరప పొలంలో ముందుగానే తొమ్మిది రకాల పచ్చి రొట్టె ఎరువులను వేసి పంట బాగా సాగు చేసినందుకు అభినందించారు.

కంది సాగుపై కర్షకుల ఆసక్తి



కోనాపురం సమీపంలో సాగు చేసిన కందిపంట

ఉరవకొండ రూరల్: వర్షాధారంపై ఆధారపడి సాగు చేస్తున్న పంటల్లో రైతులు అధికశాతం మంది కంది సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఉరవకొండ మండల పరిధిలో సుమారు 9 వేల ఎకరాలలో కంది పంట సాగు చేశారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పెట్టుబడి తక్కువగా ఉండటం, పంట దిగుబడి ఎలా వచ్చినా కనీసం పంట సాగుకు తాము ఖర్చు చేసిన సొమ్ము తిరిగి వస్తుందన్న నమ్మకంతోనే కర్షకులు కంది సాగు చేస్తున్నారు. ఈ నెలలో కురిసిన వర్షాలకు కంది పైరు పచ్చగా పెరిగి రైతుల ఆశలను సజీవంగా ఉంచుతోంది.

శ్రీధరఘట్ట చెరువుకు జలకళ



చెరువు మరువ పారుతున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని శ్రీధరఘట్ట చెరువు జలకళను సంతరించుకుంది. కొద్ది రోజుల పాటు వర్షాలు కురుస్తుండడంతో ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చెరువుకు చేరుకోవడంతో చెరువు నిండుకుండలా మారింది. దీంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు పంటలకు సరిపడా నీరు చేరిందన్నారు. శ్రీధరఘట్ట చెరువు కింద 450 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువుకు మరువ పారడంతో వరి నాట్లు జోరందుకున్నాయి.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫేర్‌లో ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: ప్రొద్దుటూరులో ఈ నెల 20, 21 తేదీల్లో శిశుమందిరం విద్యార్థులకు జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫేర్‌లో రాయదుర్గంలోని శిశుమందిరం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం పాఠశాల కమిటీ అధ్యక్షుడు ధనార్జున, హెచ్‌ఎం రాజేశ్వరి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో మోడల్ ట్రిక్స్ అండ్ టిప్స్ ఆఫ్‌ఫోర్సెస్‌లో పాఠశాలకు చెందిన హర్షిత ప్రథమ స్థానం సాధించిందన్నారు. అగ్రిల్చర్ అంశంలో విద్యార్థి గీత, మోడల్ బెస్ట్ ఆఫ్ ఆపరేషన్ అంశంలో వైష్ణవి ప్రథమస్థానాలు సాధించి ప్రశంసాపత్రాలు పొందారన్నారు. విద్యార్థులు ప్రతిభ చూపడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

గంబూషియా చేపలతో దోమల నియంత్రణ



గంబూషియా చేపలను వదులుతున్న అధికారులు

రాయదుర్గంటౌన్: దోమల నివారణ చర్యల్లో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా నీటి కుంటలు, బావుల్లో గంబూషియా చేపలను అధికారులు శుక్రవారం వదిలారు. పట్టణంలోని దుగ్గిలమ్మగుడి సమీపంలోని నీటి కుంటతో పాటు మరో 11 కుంటల్లో గంబూషియా చేపలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్, ఆరోగ్య విద్యా బోధకుడు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ చేపలను వదిలారు. వారు మాట్లాడుతూజలాశయాల్లో గంబూషియా చేపలను వదలడం ద్వారా దోమల పెంపు తగ్గడమే కాకుండా రసాయనాల వాడకాన్ని తగ్గించవచ్చన్నారు. ప్రజలు వారానికోమారు డ్రైడే పాటించి దోమల నివారణకు కృషి చేయాలన్నారు.

నాణ్యమైన విత్తనంతోనే అధిక దిగుబడి



రైతులకు సూచనలిస్తున్న కార్డ్ సంస్థ ప్రతినిధి నిర్మలారెడ్డి

కూడేరు: పంటల సాగులో విత్తన ఎంపిక కీలకమని, నాణ్యమైన విత్తనం విత్తితేనే అధిక దిగుబడులు సాధించవచ్చని కార్డ్ సంస్థ ప్రతినిధి నిర్మలారెడ్డి తెలిపారు. శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ శాస్త్ర కళాశాల లెక్చరర్లు సూర్యతేజ, శ్రావణి రెడ్డి, రాజేశ్వరి, విద్యార్థులు శుక్రవారం మండల పరిధిలోని కొర్రకోడులో పర్యటించారు. కార్డ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వశక్తి రైతు సంఘం తరుపున చేపడుతున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

డబ్బులివ్వలేకనే పింఛన్ల తొలగింపు

కూడేరు: కూటమి ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ నగదును లబ్ధిదారులకు ఇవ్వలేకనే రీవెరిఫికేషన్ పేరుతో అర్హత ఉన్నా దివ్యాంగుల పింఛన్ లబ్ధిదారులను తొలగించేందుకు కుట్ర చేసిందని జైభీమ్‌రావు భారత్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామప్ప నాయక్ ఆరోపించారు. శుక్రవారం కూడేరులో ఎంపీడీఓ కుళ్లాయిస్వామిని ఆయన కలిశారు. మండలంలో నోటీసులిచ్చిన 137 మంది దివ్యాంగ పింఛన్లను తిరిగి పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం వినతిపత్రం ఇచ్చారు.

ఈ క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వ లబ్ధి

కూడేరు: రైతులు సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ (పంటల నమోదు) చేయించుకుంటేనే ప్రభుత్వ పథకాల లబ్ధి, సబ్సిడీ, బీమా వర్తిస్తాయని మండల వ్యవసాయాధికారి శుభకర్ తెలిపారు. శుక్రవారం కూడేరులోని వ్యవసాయ కార్యాలయంలో ఈ–క్రాప్ నమోదుపై రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఏఓ సమీక్షించారు. కార్యక్రమంలో ఏఈఓలు దిలీప్ కుమార్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ వర్కర్లుగా ఐదుగురు అంగన్‌వాడీల ఎంపిక

కూడేరు: మండల ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న ఐదుగురు అంగన్‌వాడీ వర్కర్లు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా బెస్ట్ వర్కర్ల అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం సీడీపీఓ శ్రీదేవి వారికి బెస్ట్ వర్కర్ సర్టిఫికెట్లను అందజేశారు. సర్టిఫికెట్లు అందుకున్న వారిలో పారిజాత, శ్యామల, శాంతమ్మ, అనిత, ధనలక్ష్మీ ఉన్నారు.

మున్సిపాలిటీని కలసికట్టుగా అభివృద్ధి చేసుకుందాం

కళ్యాణదుర్గం రూరల్: పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకుందామని స్థానిక ఎమ్మెల్యే సురేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మాస్టర్ ప్లాన్‌పై సలహాలు, సూచనల కోసం ప్రజాప్రతినిధులు, పట్టణవాసులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వంశీ మాట్లాడుతూ మాస్టర్‌ప్లాన్ ఒక్కసారి అమలైతే 20 ఏళ్లు మార్పుడానికి అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పట్టణ వాసులు పాల్గొన్నారు.

28న మండల సమావేశం

గుమ్మఘట్ట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జెడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యులు అధికారులు హాజరు కావాలన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్క నాటుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా డెన్సిటీ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలందరూ భాగస్వాములై మొక్కలు సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అలాగే గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.